**ఎంత అందమూ, ప్రత్యేకతా వున్నా భార్యలో చూళ్లేవు భర్త కళ్ళు. ఈ అలవాటులో పొరపాటును దిద్దుకోకపోతే ఫలితం యెంత విషాదకరంగా పరిణమిస్తుందో!**

భార్య అప్పుడే యిచ్చిన కాఫీతాగి విశ్వం బయటకు బయల్దేరబోతున్నాడు. కాఫీవేడి గొంతులో అలాగే వుంది. సిగరెట్టు వెలిగించి దమ్ము లాగాడు. విశ్వం ముఖంలో ఏదో అసంతృప్తి.

దీనికి కారణం భార్య యిచ్చిన కాఫీ స్ట్రాంగ్‌గా లేదు. ఆ నీళ్ళకాఫీ తాగితే ఉత్సాహానికి బదులు, నీరసమొచ్చింది. ఆ నీరసంమీద సిగరెట్టు కాలిస్తే రంపపుపొట్టు కాల్చినట్టుంది.


రాజ్యంతో లక్షసార్లు చెప్పాను కాఫీ స్ట్రాంగ్‌గా చేయమని. ఆవిడ వింటేగా! మధ్యాహ్నం మిగిలిపోయిన డికాక్షన్‌లో యిన్ని నీళ్ళు కలిపి యిచ్చింది ఛీ! యీ లేడీస్‌కి కామన్ సెన్స్ ఉండదు. ఎంతసేపూ కూరలూ, పచ్చళ్లు, వడియాలు అంటూ ఏడుస్తారుగాని, కాఫీ బాగా కలపడం మాత్రం నేర్చుకోరు- విశ్వం చికాకుపడ్డాడు మనసులో. యింతలో ఓ కుర్రాడు వచ్చి "మా కంపెనీ మేనేజరు గారు యివి మీకిచ్చి రమ్మన్నారు సార్" అంటూ రెండు చక్కటి డైరీలు యిచ్చి వెళ్ళాడు.

'అవును! రెండు ఎందుకిచ్చాడు? పోనీలే, ఒకటి రాజ్యానికిస్తాను. ఏ చాకలి పద్దులో రాసుకుంటుంది' అనుకుని రాజ్యాన్ని పిలిచాడు.

"ఇదిగో, యివాల్టి నుంచి నువ్వు చాకలి పద్దులూ అవీ దీంట్లో రాసుకో! నా ఆఫీసు కాయితాలు చింపెయ్యకు" అని ఆమె మీదకు డైరీ విసరి విసురుగా బయటకెళ్ళిపోయాడు.

తిన్నగా బీచ్‌కెళ్ళాడు. గాలి చల్లగా వీస్తోంది. కాంటీన్‌లో డబల్ స్ట్రాంగ్ కాఫీ తాగి, సిగరెట్టంటించాడు. అలా నడుచుకుంటూ వెళ్ళి ఓ చోట కూర్చున్నాడు. చేతిలో డైరీ ముద్దుగా ఉంది. నీరెండ పడి ముచ్చటగా మెరుస్తోంది. విశ్వానికి ఎప్పటి నుంచో డైరీ రాసుకోవాలని సరదా! అతని మనసులో మెదిలే అనేకానేక అమూల్య అభిప్రాయాలు అందులో రాసుకోవాలని అతని కోరిక. ఇన్నాళ్ళకి తనకి నచ్చిన డైరీ దొరికింది. యీ రోజే అందులో శ్రీకారం చుట్టి తన భావాలు, అనుభవాలు వ్రాయడం ప్రారంభించాలనుకున్నాడు. ఏం వ్రాయనా అని చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

బీచ్‌లో ఎదురుగా ఒకామె యిసకలో నడుస్తోంది. ఆమె నడక చాలా వయ్యారంగా వుంది. అది తెచ్చిపెట్టుకున్నది కాదు. అందమైన ఆమె వంపుల హొయలు. ఆమె ఒకసారి యిటు తిరిగి చూసింది. అందమైన ముఖం. విశాలమైన కళ్ళు. ఆమె నవ్వింది. విశ్వాన్ని చూసికాదు. తన ముందర నడుస్తూ బోర్లపడిన ఆమె బాబునిచూసి ఆమెపళ్ళు దానిమ్మగింజలా ఉన్నాయి. 'నవీన్, డోంట్ బి నాటీ-' ఆమె అన్నగా బాబుని మందలించింది. ఆమె కంఠం స్వీట్‌గా, కల్చర్డ్‌గా ఉంది. ఆమె విశ్వాన్ని మురిపించింది 'ఆమె భర్త ఎవరో అదృష్టవంతుడు' విశ్వం ఒక నిట్టూర్పు విడిచాడు.




వెంటనే విశ్వానికి ఫ్లాష్‌బాక్‌లా తన భార్య రాజ్యం జ్ఞాపకం వచ్చింది. రాజ్యం అందమైనదే! ఆమె కళ్ళూ విశాలంగా ఉంటాయి. కాని వాటిలో యీ 'కళ' లేదు! అవడానికి పెద్ద కళ్ళు. కాని ఏం లాభం? అవి మాటాడవు. వాటిలో దూరాన్నున్న నక్షత్రాలు ప్రతిబింబించవ్. వాటిలో సముద్రంలోని నీలాలు కదలవ్. వాటిలో కోర్కెల వెచ్చని గాడ్పులు లేవు. చల్లని, మంచి కళ్లు. అంతే! విశ్వం తలుచుకొని, తీవ్రంగా నిరుత్సాహపడ్డాడు. బీచ్‌లో కనిపించినామెను డైరీలో కెక్కించాలనిపించింది. ఆమెను చూడగానే తనలో స్పందించిన భావాలు, రాజ్యం తలపుకు రాగానే తనలో ముసురుకున్న నైరాశ్యం, కొత్త డైరీలో మూడు పేజీలు నింపాడు విశ్వం.

ఇంటికి చేరేసరికి బాగా ఆలస్యం అయింది. ఇంట్లో అడుగుపెట్టగానే రాజ్యం అరిచింది, "ఊడిపడ్డారా, క్లబ్ నించి? యివాళ శనివారం. చపాతీ, కూర చేస్తానని తెలుసుగా, పెందరాళే రాకూడదూ!" అని విశ్వానికి కోపం వచ్చింది. "మగాడికి చపాతీలు, మినపరొట్టెలూ తినడంకన్న వేరే ఆనందం లేదా?" అని కోపంగా సమాధానమిచ్చాడు. బీచ్‌లో అమ్మాయినిచూసిన ఆనందం ముందర ఈ వెధవ చపాతీలు ఎందుకూ పనికిరావు. రాజ్యానికి ఎప్పుడూ తిండిగోలే! పొరపాటున ఆ మాటే పైకి అన్నాడు— "నీకెప్పుడూ తిండిగోలే!" అని. వెంటనే నాలుక్కొరుక్కున్నాడు. కాని అప్పుడే నిప్పంటుకుంది. "ఏన్నారూ? నాకు తిండిగోలా? ఏం, నేను రోజూ ఏం

తినేస్తున్నాననీ? మనిద్దరం తినేది రోజూ రెండు సార్లేగా? మీరే యింకా బయట చిరుతిళ్లు తింటారు; రెక్కలు ముక్కలు చేసుకుని మీ కోసం కమ్మగా చపాతీలు చేస్తే నాకిదా బహుమానం?.... ఏం మాట్లాడరేం?"

విశ్వానికి చికాకెత్తిపోయింది. కొండ మీద నుంచి రాళ్ళు దొర్లినట్టు దొర్లు

# డైరీ vs డైరీ

ఓ.పి.రమారవ్




తున్నాయి మాటలు. అడ్డొస్తే తగుల్తాయి! ప్రక్కకు తప్పుకుంటే అవే పోతాయి. నిశ్శబ్దంగా వెళ్ళి చపాతీలు తిని ఆఫీసు గదిలోకి వచ్చాడు. ఏమీ తోచడం లేదు. టేబుల్ మీద డైరీ ఆహ్వానిస్తోంది. అప్రయత్నంగా డైరీ తీసి సాయంత్రం రాసుకున్న మూడు పేజీలూ చదువుకున్నాడు. మళ్ళీ రాయడం ప్రారంభించాడు.

"రాత్రి పది దాటింది. చుట్టూ నిశ్శబ్దం-నా మనసులో తప్ప. రాజ్యం వెనకనుంచి వచ్చి భుజంమీద చెయ్యివేసి పిలుస్తుందని అరగంటనుంచి ఆశగా చూశాను. అర గంట క్రితం వరకూ రాజ్యం. వంటింట్లో రాజ్యం చేస్తూనేవుంది. ఇప్పుడు గాఢ సుషుప్తిలోకి వెళ్ళిపోయి వుంటుంది. నన్ను నా వొంటరితనానికి వదిలేసి! రాజ్యానికి బి. ఎ. డిగ్రీ వున్నా కల్చర్ లేదు. రసికత్వం లేదు. రాజ్యం ఈజ్ ఎ గ్రైండింగ్ మిషన్! యంత్రంలా పనిచేస్తుంది. పూర్ గర్ల్!"

రాస్తుంటే నిద్రొచ్చింది. వెళ్ళి పడుకున్నాడు. బీచ్‌లో కనిపించిన అమ్మాయి వూహలో మెదిలింది! నిద్రలో రాజ్యం చెయ్యి మీదవేసింది. విశ్వం వులిక్కిపడ్డాడు. ప్రక్కకు తిరిగి రాజ్యంకేసి చూశాడు. రాజ్యం మంచి నిద్రలో వుంది. అతణ్ణి ఏదో నిరుత్సాహం ఆవరించింది. రాజ్యం తగలకుండా దూరంగా జరిగి పడుకున్నాడు.

మర్నాడు లేస్తూనే పెరట్లోకి వచ్చాడు. అప్పుడే రాజ్యం ఆదివారం తలంటు కార్యక్రమంలో చాలా బిజీగా వుంది. "కాఫీ కలిపి పెట్టాను. వెచ్చపెట్టుకు తాగండి" కుంకుడుకాయలు చితక్కొడుతూ తలెత్తకుండానే అంది. విశ్వం కాఫీతాగి అర గంట పోయాక మళ్ళీ వచ్చాడు. రాజ్యం మోకాలుపైకి చీర ఎగకట్టి, ఒక చేత్తో సున్నిపిండి వళ్ళెం మీద నూనెగిన్నె బ్యాలన్స్ చేస్తూ, మరోచేత్తో వేణ్ణీళ్ళ బకెట్టు మోసుకుంటూ బాత్‌రూమ్‌లోకి వెళుతూంది. విశ్వాన్ని చూసి "యింకా అల్లాగే ఉన్నారా? చిట్టి తలంటు అవగానే మీకే" అని ఓ హెచ్చరిక పారేసి పోయింది. విశ్వం ఆమె మాటలు వినిపించుకోలేదు. ఆమె చేతులూ, పాదాలూ, మోకాళ్ళూ పరిశీలనగా చూశాడు. అంత సుందరమైన విగ్రహం కాదనిపించింది విశ్వానికి. విశ్వం మనసులో తను యిది వరలో చూసిన అందమైన శిల్పాలూ, తన ఆల్బమ్‌లో తొంగి చూసే ఫ్రెంచి బ్యూటీస్ మెదిలారు. వాళ్ళకీ, రాజ్యానికీ పోలికెక్కడ అని దిగాలుపడి ఓ స్టూలు మీద కూర్చుని ఆలోచిస్తూ పరధ్యానంగా

# సుభాషితాలు

తెలివి హీనులు బల్లగుద్ది చెబుతారు. తెలివైనవారు నోరు మెదపరు. ఇదే ప్రపంచానికి అరిష్టం.

*   *   *

నేటి సమాజంలో రెండు రకాల నీతులున్నాయి. ఒకటి బోధిస్తాం కాని ఆచరించం, రెండోది ఆచరిస్తాం కాని పైకి చెప్పం.

—బెర్ట్రాండ్ రస్సెల్

*   *   *

మరొకరు కాపించిన మార్గాన వెళ్ళి మంచిని తెలుసుకోవడంకంటె, ఎవరికి వచ్చిన దారిన వారు వెళ్ళి చెడును తెలుసుకోవడమే శ్రేయస్సు.

—డాస్టోవిస్కీ

*   *   *

మనకి సంభవించేవి రెండురకాల విపత్తులు. ఒకటి మనకి పట్టిన దురదృష్టం. రెండోది మరొకడికి పట్టిన అదృష్టం.

—లా బ్రుయెరీ

*   *   *

ద్వేషంగా మారిన ప్రేమని మించిన ద్వేషం ఈ ప్రపంచంలో లేదు. నిందించబడ్డ శిశువును మించిన కాఠిన్యం నరకంలో కూడా వుండదు.

—ఆయన్ పట్టి

*   *   *

యౌవనం గతించినపుడు, నడివయస్సు వీడ్కోలిచ్చినపుడు, మానవుడు కన్నీరు కార్చడం మరచిపోతే మనకి మహా కావ్యాలుండవు.

—ఉమర్ ఖయ్యాం

*   *   *

యౌవనం ఒక పెద్ద పొరపాటు. నడివయస్సు ఒక భయంకర సంఘర్షణ; వార్ధక్యం ఒక పెద్ద చింత.

—బెంజిమన్ డిస్రేలీ

*   *   *

మొదటి కోర్కెను త్రుంచివేయడం తేలిక. ఆ తరువాత వాటిని తృప్తిపరచడం కంటే.

—ఫ్రాంక్లిన్

సేకరణ :

— అయినాల కనకరత్నాచారి

వున్న విశ్వానికి. నెత్తిమీద యింత నూనె పడగానే తెలివొచ్చింది.

"ఏమిటీ మోటు సరసం?" అని కసురుకున్నాడు, నూనె రుద్దిన రాజ్యాన్ని.

"సరసంలాగే వుంది నాబతుకు, తొమ్మిదవుతోంది. ఎప్పటికి తలంట్లవుతాయి. ఎప్పుడు వంట మొదలెట్టను" అంది రాజ్యం తన కార్యక్రమం కానిస్తూ.

విశ్వం కోపం, ఉక్రోషం దిగమింగుకున్నాడు. రాజ్యాన్ని నానాతిట్లూ తిడుతూ, అక్కడికక్కడ డైరీలో రాయాలనిపించింది. "ఏం? ఒక్క ఆదివారం తలంటుకోపోతే ఏమైపోతాం? ఎన్నిసార్లో చెప్పాను రాజ్యానికి, ఒక్క ఆదివారమైనా యీ వెధవ ప్రోగ్రామ్ మానేసి హాయిగా ఉండనివ్వమని! ఈ మొద్దమ్మాయికివే సరదాలు! ఛీ!" డైరీలో రాసుకోబోయేవి తలుచుకున్నాడు.

ఆ సాయంత్రం విశ్వం మళ్ళీ బీచ్‌కి బయలుదేరాడు. రాజ్యం రాదని తెలుసు. రాకపోతే బాగుండునని వుంది. అయినా అడిగాడు. "బీచ్‌కి నువ్వుకూడా రాకూడదూ!" అని.

"ఆఁ బీచ్‌కి వెళ్ళనట్టేవుంది నా వరస. ఇంతవరకు పనిమనిషి రాలేదు."

విశ్వం బయటకు నడిచాడు. "ఏమండీ!" రాజ్యం పిలిచింది. "నాకు యీ మధ్య చాలా నీరసంగా ఉంటోంది. యిది వరకు పనంతా ఒంటి చేతిమీద చేసుకున్నా అలసట ఉండేది కాదు...."

'వీళ్ళకిదో దురలవాటు. సరిగ్గా వెళుతూంటే ఆపి, అరగంట సోది మొదలెడతారు' విశ్వం లోపల విసుక్కున్నాడు.

"....యిప్పుడు గుండెల్లో పోటొస్తోంది. వచ్చేటప్పుడు విటమిన్ మాత్రలు తెచ్చిపెడతారా?" అంది.

"అలాగేలే!" ముభావంగా అని, గబగబా వెళ్ళిపోయాడు విశ్వం. "అలా చక్రంలా తిరుగుతూ పనిచేస్తే భీముడికూడా నీరసం పట్టుకుంటుంది" విశ్వం కోపంగా తిట్టుకున్నాడు రాజ్యాన్ని.

బీచ్‌లో యీసారి ఆ అమ్మాయి కనిపించలేదు. కాని ఎందరో దంపతులు కనిపించారు. అడుగులో అడుగువేసుకుంటూ, ఒకళ్ళ మీద ఒకళ్ళు వాలిపోతూ, సుతారంగా ఐస్‌క్రీంలు తింటూ, యిసకలో పడుతూ, లేస్తూ విహరిస్తుంటే విశ్వానికి చూడముచ్చటైంది. విశ్వానికి రాజ్యం జ్ఞాపకం వచ్చింది.

"రాజ్యానికి హౌస్ కాంప్లెక్స్. కొంతమంది జీవితంలో ఒక పరిధిగీసుకుంటారు. అందులోనే వాళ్ళ ప్రపంచం నిర్మించుకుంటారు అది దాటి బయటకురారు. వాళ్ళ జీవిత సార్థకత అందులోనే."

రాజ్యాన్ని గూర్చి తన అభిప్రాయం రాత్రి డైరీలో కెక్కించాడు విశ్వం. రోజులు గడిచినకొద్దీ డైరీ నిండుతోంది. విశ్వంలో అవ్యక్తంగా, మసక మసకగా వున్న భావాలు డైరీలో స్పష్టమైన రూపం దాల్చుతున్నాయి. తన జీవితంలో యింత నిరుత్సాహం, రాజ్యంఅంటేయింత విముఖత పేరుకుందని డైరీ చెబుతోంది. తనలాంటి సరదాలున్న వాడికి, రాజ్యం తగిన భార్య కాదనిపించింది విశ్వానికి. ఆమె మీద కోపం దాచుకున్నా ఏదో రూపంలో బయట పెడుతూనే ఉంది.

నాలుగు నెలల తర్వాత అంతవరకు తను డైరీలో రాసుకున్న ఆవేదనలో ముఖ్యాంశాలు యిలా రాసుకున్నాడు.

1. రాజ్యం అందమైనదే కావచ్చు కాని, ఆ అందంలో స్పందన లేదు. ఆకర్షణ లేదు.

2. రాజ్యం ఒక రుబ్బింగ్ మిషన్, ఫైనర్ ఉేస్టులు లేవు. వెరీ ప్రొజెయిక్.

3. ఆమెతో తన జీవితం ముడిపడడం, ఒక ట్రాజెడీ!

4. యిప్పుడు చేయగలిగింది లేదు. తిరిగి ఆమెతో కొన్ని మధురక్షణాలు సృష్టించుకోడం అసంభవం.

5 భరించేవాడే భర్త అన్నారు గనుక, ఆమెను భరించాలి— అంతే!

విశ్వాన్ని ఒక రకమైన అశాంతి ఆవరించింది. కొన్నాళ్ళు రాజ్యానికి దూరంగా ఎక్కడికైనా పోయి తిరిగి వస్తే బాగుండుననిపించింది. ఆ సాయంత్రం యింటికి రాగానే రాజ్యం అంది: "మా అక్కయ్య ఉత్తరం రాసింది. వాళ్ళ అబ్బాయి బారసాల. నన్ను రమ్మంది. అక్కడి నుంచి తిరుపతి వెళతారుట. నేను వెళతాను. పది రోజుల్లో తిరిగి వస్తాను. నాకు మనసు బాగా లేదు."

తను కోరుకుంటున్న ఏకాంతం యిలా లభ్యమవుతున్నందుకు విశ్వం సంతోషించాడు. "తప్పక వెళ్ళిరా" అన్నాడు ఉత్సాహంగా.

"మీ భోజనం అదీ...."

"నాకేం లోటులేదు. ఊళ్ళో గజానికో హోటలుంది."

"ఆ హోటలు మెతుకులు మీకు పడవు. అసలే మీ ఆరోగ్యం...."

"ఏం ఫరవాలేదు. నా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటాను"

ఓ చంటి పిల్లాడిని అన్నం, నీళ్ళు లేని అడవిలో వదిలి వెళుతున్నంత బాధ

పడుతూ ఆఖరుకు యెలాగో వెళ్ళింది రాజ్యం. వెళుతుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళెందుకు తిరిగాయో అర్థం కాలేదు విశ్వానికి. 'ఈ ఆడవాళ్ళు మనల్ని అర్థం చేసుకోరు. వాళ్ళు మనకర్థమవరు' అనుకున్నాడు విశ్వం తల గోక్కుంటూ.

రాజ్యం వెళ్ళాక స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నట్లుంది విశ్వానికి. హోటలు భోజనం సరదాగా వుంది. స్నేహితులతో గంటల కొద్దీ కబురు చెపుతూ, సినిమాలకి వెళుతూ, హుషారుగా వున్నాడు విశ్వం. టీ ఎంతాగినా, మరో పాకెట్టు సిగరెట్లు వూదిపడేసినా వుహూరుమంటూ తిట్టుకునే వాళ్ళు లేరు. కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి.

ఒక రోజు ఏదో కావలిసొచ్చి రాజ్యం బీరువాతీసి వెతుకుతుంటే, రాజ్యానికి తను యిచ్చిన డైరీ కిందపడింది. అందులో ఏముంటుందో విశ్వానికి తెలుసు. ఏముంది, మొదట చాకలిపద్దు, మధ్యలో పాలబాకీ, ఆపైన కొత్త వంటకాలు, ముగ్గులు .... యింతకన్నా ఏముంటుంది రాయడానికి. తెరచి చూశాలన్న కుతూహలం కూడా కలగలేదు విశ్వానికి. దూరంగా విసిరేశాడు.

రాత్రి చాలా ఆలస్యంగా యింటికొచ్చి పడుకోడానికి వెళుతుంటే కాలు దేనిమీదో పడింది. రాజ్యం డైరీ! పేజీలు తిరగబడి ఉన్నాయి. అలాగే పైకి తీసి చూశాడు. ఏమేమో రాసి వుంది. కుతూహలం, ఆశ్చర్యం ముంచెత్తాయి. ఏమిటింత రాసింది? లైటు దగ్గరగా కుర్చీ లాక్కుని చదవడం ప్రారంభించాడు.

.... .... .... ....

ఇవాళ మంచి రోజు! ఎంతో కాలానికి మావారు నాకో మంచి ప్రెజెంటిచ్చారు. కాని విసుక్కుంటూ యిచ్చారు. ఏదోలే! అసలు యిచ్చారు. ఆఫీస్‌లో ఏ ఫ్రెండ్‌కో, లేడీ టైపిస్ట్‌కో 'ప్రేమ'తో దానం చెయ్యకుండా. 'చాకలి పద్దురాసుకో' అని మొహంమీద విసిరినంత పని చేశారు. యీ మొగాళ్ళకి బుర్రలేదా అనిపిస్తుంది. ఇంత మంచి డైరీలో చాకలి పద్దులు రాసుకుంటారా? అయినా, ఈయనగారు ఎవరో వుచితంగా యిచ్చిన డైరీ నాకు బహూకరించేవరకు చాకలి పద్దులు గోడమీద రాసుకుంటున్నాననుకున్నారా? సిల్లీ!

.... .... .... ....

మధ్యాహ్నంనుంచి తలపోటు ఉప్పెనలా వచ్చింది. అందులోనూ ఈ మధ్య చాలా వీక్‌గా వుంటోంది. మందులు తెమ్మని ఆయనకు రోజూ చెపుతూనే ఉంటాను, ఆయన రోజూ సారీ, మరచిపోయానంటూనే ఉంటారు. భార్య ఆరోగ్యం గురించి ఆ మాత్రం శ్రద్ధ వహించకపోతే ఎలా? అదీ కాక, యీ మతిమరపు మొగాళ్ళు ఆఫీసుల్లో ఏం పని వెలగబెడతారు?

.... .... .... ....

పని మనిషి రాలేదు. నాకు వంట్లో బాగా లేదని ఆ దేవుడు దానికీ, మా వారికీ టెలిగ్రాంలు పంపుతాడనుకుంటా. అది పనికి రాదు, ఆయన యింటికి రారు. అల్లాగే లేచి పనంతా చేసుకున్నాను. ఆయన కోసం చపాతీలు- కూర చేశాను. వెన్నలా కరిగిపోతున్నాయి. ఆయనకి వేడిగా పెడదామని కాచుక్కూర్చున్నా. ఆయన ఆలస్యంగా వచ్చి "నీ కెప్పుడూ తిండిగోలే"

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

# రౌద్రి 1980 దీపావళి ప్రత్యేక సంచిక



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక మునుపటివలెనే దీపావళి ప్రత్యేక సంచికను 232 పేజీలకు తగ్గకుండా ప్రముఖ రచయితలు, రచయిత్రుల కథలు, కార్టూనులు, కవితలు, ఒక ప్రత్యేక నవల, పెద్ద కథ, నాటిక-ఇంకా అనేకానేక ఆకర్షణలతో శ్రీ బాపు ముఖచిత్రంతో నవంబరు 1980 మొదటి వారంలో వెలువడుతుంది.

ప్రకటనకర్తలు, ఏజెంట్ మహాశయులు ఎప్పటివలెనే మాతో సహకరించి మా ప్రయత్నాన్ని విజయం చేయగలరని ఆశిస్తున్నాము. వెల రు. 8-00

బిజినెస్ మేనేజర్, ఆంధ్రజ్యోతి

ఏజెంట్లు తమ ప్రత్యేక ఇండెంట్లను సర్క్యులేషన్ మేనేజర్‌కు వెంటనే పంపాలి!

## వర్ధమాన క్రీడాకారులు

# కుమారి డి. ప్రమీల



చిన్న వయసునుంచి క్రీడలలో శిక్షణ యిచ్చినట్లయితే ఎవరైనా జాతీయ స్థాయి క్రీడాకారులుగా రూపొందవచ్చుననడానికి నిదర్శనం కుమారి డి. ప్రమీల. ఇందుకు కావలసింది తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరియైన తర్ఫీదు. తండ్రి శ్రీ డి. రామకృష్ణయ్య మంచి ఎథిలెట్. ఐ. ఏ. ఎస్. ఉద్యోగిగా వుండి కూడా తన పిల్లలను మంచి ఎథిలెట్‌లుగా రూపొందించటంలో ఈయన చూపిన ఆసక్తి ప్రశంసనీయం.

కుమారి ప్రమీల చిన్నవయసునుంచీ ఆటలలో ఆసక్తి చూపేది. పాఠశాల విద్యార్థినిగా అనేక పోటీలలో పాల్గొని పతకాలు సాధించింది. గత ఏడాది చిత్తూరులో నిర్వహించబడిన ఆంధ్రప్రదేశ్ ఎథిలెట్ పోటీలలో అన్నిటా ప్రథమ స్థానం సాధించి వర్థమాన క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. 17 ఏళ్ళ లోపు బాలికల విభాగంలో 100 మీ. 200 మీ. షాట్‌పుట్, డిస్కస్‌త్రో. లాంగ్‌జంప్‌లలో స్వర్ణపతకాలు, వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించింది యీ చిన్నారి. జాతీయ ఎథిలటిక్స్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని "డిస్కస్ త్రో"లో ద్వితీయ స్థానం పొందింది.

ఈ ఏడు నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మహిళల విభాగం డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం సాధించింది. అఖిల భారత పోటీలలో కాంస్య పతక విజేత. తర్ఫీదూ, అవకాశాలూ లభించినట్లయితే జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రూపొందగల చురుకు, నేర్పరితనం ఈమెకు ఉన్నాయి.

—ముకరమ్

---

అని కసురుకున్నారు. నాకు ఉక్రోషం వచ్చింది. ఏదో వాగాను! ఆయనకోసం కదూ నేనంత శ్రమపడతా! కాని ఆయనెంత చులకనగా మాట్లాడారు!

.... .... .... ....

ఏమిటో ఈమధ్య ఆయనకు చికాకెక్కువైంది. నేను దగ్గరకెడితే, దూరంగా జరుగుతున్నారు! ఏమొచ్చింది రోగం! తలంటుకోమంటే చికాకు, పాలు తాగమంటే చికాకు, పాడితే చికాకు, పలకరిస్తే చికాకు!

ఈ మగాళ్ళకి ముస్తాబై, నవ్వుతూ, జుట్టులో వేళ్ళు పోనిచ్చి, శరీరం తగిలిస్తూ వలపు వొలకబోస్తూ యింత విషం యిస్తే యిట్టే మింగేస్తారు. అదే బాధ్యతగా, భార్యగా అమృతం యిచ్చినా ముట్టకోరు. నిజ జీవితంలో రోజూ ఎక్కడ నటించగలం. అర్థం చేసుకోవాలి గాని!

.... .... .... ....

అసలు యీయనకి మతి చెడిపోయింది దీనికి కారణం. ఏ ఆఫీసు ఫైలో 'గోవిందా' అయ్యుంటుంది. లేదా, ఏ బీచ్‌లోనో అందమైన అమ్మాయి కనిపించి ఉంటుంది.

నాకన్న అందమైన అమ్మాయి లేదని, పెళ్ళయిన కొత్తలో రోజుకో ఉత్తరం రాసేవారు. మరి యిప్పుడు ఆయన "అందం" అంతా యింటి బయటే ఉన్నట్టు ఫీలవుతారు. చిన్నపిల్లలు ఓ బొమ్మకోసం గుక్కపట్టి ఏడుస్తారు సరేకదా అని యిస్తే కాసేపటికి అది విసిరేసి, యింకో బొమ్మకోసం ఎగబడతారు! మరి కాసేపటికి యింకోటి. చివరికి ఏ విరిగిపోయిన కర్రముక్కో పట్టుకుని సంతృప్తిపడతారు.

ఈ మగాళ్ళు అంతే. చిల్డ్రన్ ఎట్ హార్ట్!

ఈ చంచలత్వానికి రసికత్వం అని గొప్ప నామకరణం చేసుకుని గర్వపడిపోతారు! అలాగే తమ భార్యలూ రోజూ కొత్తదనం కోరుకుంటే, యీ పిల్లలూ, సంసారం ఏమైపోతారో కొంచెం కూడా ఊహించరు. యింత అందమైన భర్త దొరికాడనీ, తమ భార్యల జన్మ ధన్యమైందనీ వాళ్ళ ఊహ! ఎంత త్యాగమూ, దాని వెనుక ప్రేమా వుంటేకాని తమకీ "గ్యారంటీ" భార్యలు దొరుకుతారో ఊహించుకోరు. యిడియట్స్!

కామిని తలుచుకుంటే ఎందరినైనా కొంగుచుట్టూ తిప్పుకోగలదని తెలియమా!

.... .... ....

ఇలాంటి డైరీ ఒకటి నేను కాలేజీలో చదువుతుంటే నా క్లాస్‌మేట్ శేఖర్ యిచ్చాడు. "విత్ లవ్" అని రాసి యిచ్చాడు. పాపం — నేను చాకలి పద్దులు రాసుకునే మొద్దునని అతనికేం తెలుసు! నా కోసం పిచ్చివాడిలా తిరిగేవాడు. తలుచుకుంటే జాలేస్తుంది. ఓసారి నా పాట విన్నాడు. "మీ కంఠంలో వినిపిస్తాయి నాకు సముద్ర ఘోషలు, పువ్వుల గుసగుసలు, నక్షత్రాల నవ్వులు...." పిచ్చి కవిత్వం నామీద! అతనూ బాగా పాడేవాడు. మా శ్రీవారికి పాట, పద్యంలేదు. ఎంతసేపూ సిగరెట్లూ, స్నేహితులూ, హోటళ్లూ ఉంటే చాలు. నేను పాడతానని ఆయనకి తెలుసా అనిపిస్తుంది.

వేసవిలో తలలో మల్లెలు తురుముకుని, డాబామీద, ఆయన అలా పడుకుని వింటూంటే, హాయిగా పాడుకోవాలని ఉండేది. ఆయన ఆఫీసు గొడవలు చెప్పుకోడం తోటే తెల్లారి పోయేది. ఆయనకి పాట విలువేం తెలుసు — సామెత చెప్పినట్టు!

.... ........ .... ....

మొన్న డాబా మీద బట్టలు ఆరేస్తున్నా. దూరంగా ఎవరో యిద్దరు సైకిళ్ళ మీద వస్తున్నారు. ఒకతను యువకుడు. నిటా


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
_శస్త్రచికిత్స
అవసరములేదు!

రుగా కూర్చుని, దృఢంగా సైకీలు తొక్కుతున్నాడు. రెండో ఆయన పెద్దాయన-వాలిపోయి నీరసంగా తొక్కుతున్నారు. భుజాలు వంగిపోయాయి. తెలిసిన ముఖంలా ఉందని పరికించి చూశా....నా ఖర్మ. నాకు చత్వారం కూడా దాపురించిందిలా ఉంది. ఆయన మా వారే! ఏమిటి అంత ముసలి రూపు పడింది అని ఆశ్చర్యపోయా!

.... .... .... ....

ఆమధ్య ఓ షాపులో శేఖర్ కనిపించాడు. యింకా ఎంత కుర్రాడిలా ఉన్నాడు। అతను కాలేజీలో స్పోర్ట్స్‌మన్. అతను టెన్నిస్ డ్రెస్‌లో రాకెట్ పుచ్చుకుని నడుస్తుంటే ఎంతో ఠీవిగా వుండేవాడు. మా వారిని ఆటల మాటటుంచి, రోజూ రెండు మైళ్ళు నడవండి అంటే వింటేనా? ఈయనకి క్లబ్బులు, సిగరెట్లు, స్నేహితులు, కబుర్లు! శుద్ధ డిస్సిపేటివ్ లైఫ్. అసలు యాంబిషన్ లేదు. ఆత్మబలం లేదు.

హావ్ ఐ మేడ్ ఎ రాంగ్ చాయిస్?

నో! నా పట్టు చీరల కోసం, నగల కోసం, నా సరదాలకోసం ఆయన్ని కట్టుకోలేదు. ఆయనకోసం నేనూ, నాకోసం ఆయన, అదే నాకు ఆనందం. అదే నాకు సంతృప్తి. ఆయన యెప్పటికైనా అలవాట్లు మార్చుకుని బాధ్యతగా వుంటే నాకంతే చాలు."

డైరీ చదువుతూన్నంతసేపూ, విశ్వం ఆశ్చర్యపోయాడు. ఏమిటీ. రాజ్యానికింత ఆలోచనా, యింత స్వతంత్ర భావాలూ ఉన్నాయా? మొదట ఆశ్చర్యం. తరువాత తననిగూర్చిన ఆమె అభిప్రాయాలకి బాధ, కోపం, చివరికి పశ్చాత్తాపంతో డైరీ మూసి ప్రక్కన పెట్టాడు విశ్వం.

నిజమైన, లోతైన రాజ్యాన్ని తనింత కాలం ఎందుకు గుర్తుపట్టలేకపోయాడు? తన పురుష అహంకారంతో ఆమెను ఒక వంటింటి బానిసగా ఊహించుకుని పొరపాటు చేశాడు. తను ఊహించుకున్న మూసలోనే ఆమె ప్రతి చర్యనీ సరిపెట్టుకున్నాడు. అది దాటి ఆమె ఆంతర్యాన్ని చూడలేకపోయాడు. అసలు రాజ్యం, ఫ్రీగా డెవలప్ అవడానికి తనని తను ఎక్స్‌ప్రెస్ చేయడానికి తగినంత వాతావరణం తను యింటిలో కల్పించలేదు. కొంతమంది ఎగ్రెసివ్‌గా తమ భావాల్ని యెదుటివారి పెరుద్దుతారు. కొంతమంది తమలోతాము ముడుచుకుపోతారు. వాళ్ళని సహృదయంతో అర్థం చేసుకోలేని బలమైన స్వార్థం యెదురైనప్పుడు వాళ్ళు సెల్ఫ్‌ని సబ్జుగేట్ చేసుకుంటారు. రాజ్యం తనకి భర్తగా ప్రాధాన్యత యిచ్చిందేకాని తన అర్హతలు, అభిరుచులు ప్రకటించుకోలేదు. తన దురహంకారం, బాధ్యతారహితమైన వ్యూహాలకి, తనలో లోపాలకి విశ్వం సిగ్గుపడ్డాడు. తన రాజ్యం, ప్రపంచం అంతా యీ 'విశ్వం'లో చూసుకుంది. 'ని తను 'రాజ్యాన్ని' వదలి ఎక్కడికో పరుగులు పెట్టాలని అరాటపడ్డాడు తెరలు తొలగించి ఆంతర్యాలను ప్రతిఫలించిన రెండు డైరీలలో రాజ్యం డైరీ నెగ్గింది. విశ్వంలో ఒక నూతన చైతన్యం కలిగించింది.

'రాజ్యంలాంటి ఆలోచన, సహనం, సరదాలు కల భార్య దొరకడం నిజంగా నా అదృష్టం' అనుకున్నాడు విశ్వం. విశ్వంకళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి.

మర్నాడే విశ్వం రాజ్యానికి ఉత్తరం రాశాడు:

మైడియర్, డియర్ రాజ్యం,

నిన్నటినుంచి నువ్వే జ్ఞాపకం వస్తున్నావు. హఠాత్తుగా నేను ఒంటరివాడనైపోయాను. నేను ఈ ఒంటరితనం యిక ఒక్క క్షణం భరించలేను. నిన్ను నేను తిరుపతిలో కలుస్తాను. అక్కడి నుంచి మద్రాసు వెళ్ళి నాలుగు రోజులుందాం. పిల్లల్ని మీ అక్కయ్య గారింటి దగ్గర వదిలేద్దాం. ఆనందం ఎప్పుడూ దగ్గరే ఉంటుంది. దాన్ని వెతుక్కుంటూ మనమే దూరంగా వెళ్ళిపోతాం. అలాటి వాళ్ళలో నేను ఒకణ్ణి! అందుకే దగ్గరగా వస్తున్నా. మళ్ళీ ఆ రోజులు గుర్తు చేసుకుందాం!

ప్రియమైన,

—విశ్వం.

## వెయ్యేళ్ళ తెలుగు పద్యం

పరువములైన క్రొవ్విరుల బాయక కెంపగు దాడి నిమ్మలం
దిరముగ గ్రమ్ముకొన్నట్టి పువుదేనియ లానగవచ్చి క్రమ్మఱన్
దిరుగుచు జాల్వులైన మగతేటులుమీఱెడు, జేడ: చూచితే!
విరివిలుకాడొనర్చు నల వేలిమి మంటలపై పొగల్వలెన్.

—పొన్నికంటి తెలగనార్యుడు.

రాజా, చూశావా! యౌవనంలోవున్న యెర్రని దానిమ్మ పూల తేనెను తాగి వెళిపోతున్న ఈ తుమ్మెదలు పూల విలుకాడైన మన్మథుడు చేస్తున్న యజ్ఞంలో మంటలపై వుండే పొగలాగా వున్నాయి

యయాతి ఉద్యానవనంలో విహరిస్తున్నాడు నర్మ సఖునితో కలిసి. అక్కడే....యయాతి శర్మిష్ఠల ప్రథమ సమావేశం జరగబోతుంది. ఈ సమయంలో శర్మిష్ఠమీద యయాతికున్న కోర్కెనూ, తీవ్రతనూ, భవిష్యత్తునూ అటు శర్మిష్ఠ యౌవనాన్నీ సూచించే ఈ వర్ణన కథాపరంగాకూడా సమన్వయం కుదుర్చుకుంది.

దానిమ్మపూలు ఎర్రగా వుంటాయి కనుక వాటిని మంటలతోనూ, మంటల కొసల పొగవుండక తప్పదు కనుక నల్లని తుమ్మెదలను ఆ పొగతోనూ పోల్చడంతో తీవ్రమైన కవితాభావన వాడిగా, వేడిగా తాకుతుంది మనల్ని.

తెలగనార్యుడి 'యయాతి చరితము'లోనిది యీ పద్యం.

—శ్రుతి

## నిమ్మతొనలు

నువ్వు కొంచెం తిను
నేను కొంచెం తింటాను
ఎక్కడైనా యిదే రివాజు
మరి అడక్కు దీని కాజు

—'మాధవీ సనారా'